క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎడ్యుకేషన్ సెక్రటరీ



సింగరేణి పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న మురళీధర్‌రావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ విజయవాడలోని అప్మెయిల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏజీఎం మురళీధర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పోస్టాఫీస్ సెంటర్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య, పాఠశాల పనితీరు, బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కరస్పాండెంట్ జీకే కిరణ్ కుమార్, హెచ్‌ఎం ఏ.సాయి, సుజాత, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఫూల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్త పరీక్షలు

పాల్వంచరూరల్: ఇందిరా మహిళా శక్తి విజయోత్సవాల సందర్భంగా మంగళవారం స్వయం సహాయక సంఘాల మహిళలకు పీహెచ్‌సీల్లో రక్తపరీక్షలు నిర్వహించారు. ఉలవ్వనూరులో డాక్టర్ దేవేందర్ మాట్లాడుతూ.. మహిళల్లో రక్తహీనత నివారించేందుకు రక్తపరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సదాలాదేవి, సీసీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. జగన్నాథపురం పీహెచ్‌సీలో డాక్టర్ డీఆర్.రాజు మహిళలకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, సుందర్, సీసీలు శ్రీను, పద్మావతి, వీఓఏలు పాల్గొన్నారు.

హైవేపై గుంత పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: 24 గంటలు రద్దీగా ఉండే కేశవాపురం సమీపంలోని బీసీఎం జాతీయ రహదారి కల్వర్టుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది. మంగళవారం సాక్షిలో ప్రచురితమైన 'హైవేపై పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికకు అధికారులు స్పందించారు. గుంతలో తారు నింపి పూడ్చించి వేశారు.

నేడు ఏరియా సేఫ్టీ మీటింగ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో 19వ ఏరియా లెవల్ త్రైపార్టీయేట్ సేఫ్టీ మీటింగ్ బుధవారం నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం ఎం.శాలేంరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఏరియాలో జరిగిన ప్రమాదాలపై చర్చించి, జీరో ప్రమాదాలకు తీసుకోనున్న జాగ్రత్తలపై చర్చించనున్నట్లు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామ చంద్ర డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధికల్పన శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ – 25, రికవరీ ఎగ్జిక్యూటివ్ – 5 పోస్టులకు 18 – 30 సంవత్సరాల యువకులు అర్హులని, ఆసక్తిగల వారు హాజరు కావాలని కోరారు.

క్రికెట్ టోర్నీ విజేత 'లగాన్'

పాల్వంచరూరల్: సూరారం వద్ద మంగళవారం జరిగిన పాల్వంచ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ నిర్వహించారు. లగాన్ జట్టు విజయం సాధించింది. సంఘం మండల అధ్యక్షుడు నాగరాజు విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మైలవరపు రామకృష్ణ, వనచర్ల రామకృష్ణ, గౌరీశంకర్, గద్ద ప్రభాకర్, అప్పారావు, నరేష్, రఫీ, ప్రతాప్, విద్యాసాగర్, వీరభద్రం, వీరబాబు, సుభాని, అల్లిరాము, సూర్యం, సుధాకర్ పాల్గొన్నారు.

అకారణంగా కూల్చివేశారు..

ఇల్లెందు: రజకుల దోభీ ఘాట్ పక్కనున్న తన సొంత భూమిలో నిర్మాణం చేసుకున్న ప్రహరీని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అకారణంగా కూల్చివేశారని యజమానులు పందిళ్ల వెంకటేశ్వర్లు, పిల్లి మీనమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం దోభీ ఘాట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. తనకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా గోడను కూల్చివేసి అన్యాయం చేశారని వాపోయారు. ఈ విషయమై మున్సిపల్, రెవెన్యూ అధికారులపై కోర్టును ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. తన వద్ద అన్ని హక్కు పత్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

చెరువు శిఖం దారిని పునరుద్ధరించండి...

పాల్వంచరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పేటచెరువులోని చింతకుంట చెరువు శిఖం, అడవిలో ఉన్న దారిని ఆక్రమించారని ఈ దారిని పునరుద్ధరించాలని కోరుతూ పేటచెరువు వాసులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ దారా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీతారాంబాబు, శ్రీనివాసు, పొట్టయ్య, లక్ష్మయ్య, రాములమ్మ, శేషమ్మ పాల్గొన్నారు.

దోమల కాలం.. జ్వరాల భయం

పక్షం రోజుల్లోనే ఇల్లెందు మండలంలోని విజయలక్ష్మీనగర్‌లో డెంగీ పాజిటివ్, పట్టణంలోని సబ్‌జైల్ బస్తీలో మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇలా ఒకటి, రెండు మలేరియా, డెంగీ కేసులను ముందస్తు హెచ్చరికగా భావించి పల్లెల్లో దోమల నిర్మూలన, పారిశుద్ధ్యం మెరుగుపర్చే చర్యలకు పంచాయతీలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. కానీ నిధుల లేమి పేరుతో ఉన్న వనరులను కూడా సద్వినియోగం చేసుకోకుండా ఎక్కడి పనులు అక్కడే వదిలేసి తమకేమీ పట్టనట్లుగా ఉంటున్నారు.



విజయలక్ష్మీనగర్‌లో పిచ్చిమొక్కలతో అల్లుకుపోయిన రహదారి

- పేరుకుపోతున్న చెత్త.. నిండుతున్న కాల్వలు
- మూలకు చేరిన ఫాగింగ్ మిషన్లు
- ప్రబలుతున్న మలేరియా, డెంగీ జ్వరాలు
- నిధులు లేవంటూ నిర్లక్ష్యం చేస్తున్న యంత్రాంగం

ఇల్లెందురూరల్: గ్రామాలలో పారిశుద్ధ్య పనులు అంతంమాత్రంగా ముందుకు సాగడంతో వీధుల్లో చెత్త పేరుకుపోతోంది. డీజిల్ కూడా డబ్బులు లేవంటూ ఇంటింట చెత్త సేకరణకు ట్రాక్టర్లు కదలకపోవడంతో ప్రజలు సైతం తమ ఇంటికి సమీపంలోని ఖాళీ స్థలంలో చెత్తను పోస్తున్నారు. ఇలా రోజులు గడుస్తుండటంతో పల్లెల్లో ఎక్కడ చూసినా చెత్తనిల్వలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వీధులలో ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించకపోవడంతో వీధులను కమ్మేస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో దోమలు, విషపు కీటకాలు, పాములకు నివాసాలుగా మారడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

కాల్వలు తీయక..

వీధులలో మురుగుకాల్వల వ్యవస్థపై పంచాయతీ అధికారులు దృష్టి సారించకపోవడంతో చెత్తచెదారం పేరుకుపోయి మురుగునీటి సరఫరాకు అడ్డుగా నిలుస్తున్నాయి. కనీసం బ్లీచింగ్ కూడా చల్లకపోవడంతో డ్రెయినేజీలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. తొలకరి వర్షాలకే దోమల ఉధృతిని తట్టుకోలేకపోతున్న ప్రజలు రానున్న పరిస్థితులను తలచుకుంటూ ఆందోళనకు గురవుతున్నారు.



రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్త

మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు...

ఇప్పటికే నిధుల లేమి సమస్యను ఎదుర్కొంటున్న పంచాయతీలకు మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా దోమల నివారణకు వినియోగించాల్సిన ఫాగింగ్ యంత్రాల మరమ్మతులకు మించిన భారంగా మారింది. గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 29 గ్రామపంచాయతీలు ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశాయి. కానీ ప్రస్తుతం అవి మొరాయించి మూలకు చేరాయి. వీటి రిపేరుకు ఒక్కోదానికి రూ.5వేలకు పైగా ఖర్చవుతోంది. ఈ ఆర్థిక భారాన్ని మోయలేని స్థితిలో పంచాయతీలు ఉన్నాయని అధికారులు అంటున్నారు. దీంతో పల్లెల్లో దోమల ఉధృతి పెరిగి రానున్న రోజుల్లో డెంగీ, మలేరియా కేసులు పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నిధులు మంజూరైతేనే..

వర్షాకాలం.. దోమల ఉత్పత్తికి అనువైన సమయం కావడంతో తక్షణ చర్యలకు ఉపక్రమిస్తేనే జ్వరాల ఉధృతిని అరికట్టే అవకాశం ఉంటుంది. దీనికోసం గ్రామాలలో ప్రస్తుతం ప్రత్యేక సిబ్బంది ద్వారా చెత్త కుప్పల తొలగింపు, పిచ్చిమొక్కల తొలగింపు, మురుగునీటి వ్యవస్థను సరిచేయడం, ఫాగింగ్ యంత్రాల మరమ్మతు వంటి పనులు తక్షణం చేపట్టాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీలకు తక్షణం నిధులు మంజూరు చేస్తే తప్ప పారిశుద్ధ్యం మెరుగయ్యే పరిస్థితి లేదు. ఉన్నతాధికారులు ఆ దిశగా ఆలోచించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిధుల లేమితో ఇబ్బంది...



గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు నిధుల లేమి ప్రధాన అవరోధంగా ఉంది. ఉన్న కార్మికులతో ప్రణాళికాబద్ధంగా పనులు చేయిస్తున్నాం. ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయిస్తాం. సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం.

– చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు

స్థానిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలి



మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ... ఎక్కువ సంఖ్యలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లను గెలిపించాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, బొర్రా రాజశేఖర్, దొప్పల సౌజన్య, మాలోత్ మంగీలాల్ నాయక్, కంచర్ల హరీష్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, రోకటి సురేష్, పొన్నెకంటి సతీష్, గోపు రామకృష్ణ, వాంకుడోత్ కిషన్, ధరావత్ రాంబాబు, గుగులోత్ ప్రియాంక, హలావత్ రఘు, గుగులోత్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయండి..



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందు: మున్సిపల్, గ్రామపంచాయతీలలో పని చేసే కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి కె.సారంగపాణి డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులో జరిగిన తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ... కార్మికులను పర్మనెంట్ చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని 8 గంటల పనివిధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడు టి.పామేల్, ప్రధాన కార్యదర్శి డి.ప్రసాద్, మోహన్‌రావు, రాధాకృష్ణ, రామిశెట్టి నర్సింహారావు, చింత నర్సయ్య, బిచ్చు తదితరులు ఎన్నికయ్యారు.

బాయ్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రామ్‌చరణ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యాంపస్ బాయ్స్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఇందిరాకు డీఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ఇన్‌చార్జ్ రామ్‌చరణ్ మాట్లాడుతూ... జూనియర్ కళాశాల దగ్గరలో బాయ్స్ హాస్టల్ లేదని, జూనియర్ కాలేజీ విద్యార్థులు, కాలేజీ నుంచి వేరే బాయ్స్ హాస్టల్స్‌కి వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు దూరం నడవాల్సి వస్తోందన్నారు. వర్షాకాలం కాలేజీకి రావాలంటే ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కళాశాల క్యాంపస్‌లో విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ బాయ్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన బీసీ అభివృద్ధి అధికారి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

కోతుల బెడదతో ఆందోళన



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కోతులు గుంపులుగా ఇళ్లలోకి చొరబడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని బీజేపీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... లక్ష్మీదేవిపల్లి మండలంలోని 31 గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య పనులు నిర్వహించడం లేదన్నారు.

దీంతో పాటుగా కోతులు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలో, గ్రామాలలో చెత్త పేరుకపోవడం, దీనికి తోడు వర్షాకాలం అవటం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డెం నవీన్, శివాజీ, గోవిందచారి, రావుల రాము, కవిత, అరుణ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

రూ.20తో రూ. 2లక్షల ప్రమాద బీమా

సుజాతనగర్: ఏడాదికి రూ.20 ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని భద్రాద్రి కొత్తగూడెం ఎల్‌డీఎం రామిరెడ్డి అన్నారు. లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన బానోత్ జైత్రాం, కున్సోత్ హత్తీరాంలు ఇటీవల మృతి చెందగా.. వారి నామినీలకు పీఎం జీవన జ్యోతి బీమా యోజన పథకం కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కులను మంగళవారం అందజేశారు. ఎల్‌డీఎం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలను ఏడాదికి రూ.436, జీవిత బీమా, రూ.20 తో ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు.

పల్లెల్లో పారిశుద్ధ్య సేవలు కరువు

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీలకు నిధులు లేక పారిశుద్ధ్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, కనీసం పారిశుద్ధ్య సేవలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ అంగోతు నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాండురంగాపురం తండాలో మంగళవారం మండల అధ్యక్షుడు జర్పుల పరమేష్ అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధుల లేమి వలన పంచాయతీలో పారిశుద్ధ్య పనులు ఎక్కడికక్కడే పేరుకపోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తేజవత్ రమేష్, బానోతు ప్రతాప్, రాజు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగు పర్చండి..



డీవైసీఎంఓతో మాట్లాడుతున్న వెంకట్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధానాస్పత్రిలోని ఐసీయూ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కార్మికుడు సారంగం మృతి చెందారని, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వంగా వెంకట్ ఆరోపించారు. మంగళవారం ఆయన డీవైసీఎంఓ ఉషతో ఆస్పత్రి సమస్యలపై చర్చించారు. వెంకట్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలోని ఐసీయూలో సౌకర్యాలు మెరుగు పరచాలని, నిర్వహణ సరిగా లేదని, పర్యవేక్షణ లోపంతో సోమవారం ఒక కార్మికుడు మృతి చెందినట్లు చెప్పారు. ఐసీయూలో సరైన వైద్య పరికరాలు లేవని, క్రిటికల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పొందినవారు లేరని తెలిపారు. కార్మికుడు మృతికి బాధ్యులైన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన డీవైసీఎంఓ భవిష్యత్‌లో ఇటువంటి జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ రాము, రామ్‌శంకర్, రవీందర్, శ్యామ్, రాజేశ్వరరావు, లింగం, ప్రశాంత్, ఆనంద్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల మహాధర్నాకు వెళ్లిన నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మంగళవారం జరిగిన బీసీల మహాధర్నాలో కొత్తగూడెం నియోజకవర్గ బీసీ నాయకులు పాల్గొన్నారు. వెళ్లిన వారిలో వనమా రాఘవేందర్ రావు, బత్తుల మధుచంద్, బత్తుల వీరయ్య, ముత్యాల ప్రవీణ్, ఎండీ హుస్సేన్, మధుసూదన్ రావు, దుర్గాప్రసాద్, బండ్ల పవన్ ఉన్నారు.

టేకులపల్లి: చట్ట సభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన బీసీ ధర్నాకు టేకులపల్లి మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అధ్యక్షతన బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, ఆమెడ రేణుక, ఎట్టి ప్రసాద్, నానబాల భిక్షం, నాగభూషణం, మురికి నాగేశ్వరరావు, రమేష్ తదితరులు వెళ్లారు.


సిగాచి కార్మికులకు న్యాయం చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సంగారెడ్డి జిల్లాలో సిగాచ్ ఫార్మా పరిశ్రమలో జరిగిన దారుణమైన దుర్ఘటనలో మరణించిన కార్మిక కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వాలని, ఈ ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.సత్య అధ్యక్షత వహించిన సభలో జిల్లా కోశాధికారి జీలకర్ర పద్మ, టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాలరావు మాట్లాడుతూ.. క్షతగాత్రులకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియాగా చెల్లించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి రూ.15 లక్షలు చెల్లించి పూర్తి వైద్య సదుపాయాలను ఉచితంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొడ్డ రవికుమార్, భూక్యా రమేష్, తులసీరామ్, రామ్‌కోటి, జి.రమేష్, రాజ్యలక్ష్మి, చుక్కమ్మ, వి.వాణి, టి.కృష్ణమూర్తి, నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

కామిక్ రచనలో సత్తా చాటిన విద్యార్థులు



టేకులపల్లి: బహుమతి అందుకుంటున్న తేజస్విని

టేకులపల్లి: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కామిక్ రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని మల్లు తేజస్విని జిల్లా ప్రథమ, శాగంటి హర్షిత కన్సోలేషన్ బహుమతులు సాధించారు . వీరిని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం.మోహన్‌రావు, ఎంఈఓ అజ్మీర జగన్, ఉపాధ్యాయులు అభినందించారు.

జూలూరుపాడు: కామిక్స్ రైటింగ్స్ జిల్లా స్థాయి పోటీలో పాపకొల్లు హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని జి.నితిష తృతీయ స్థానం సాధించింది. మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో జిల్లా స్థాయి కామిక్స్ రైటింగ్స్ పోటీలు నిర్వహించారు. నితిషను హెచ్‌ఎం ఎస్కే మీరాసాహెబ్, ఉపాధ్యాయులు అభినందించారు.


కౌలు రైతులకు 'భరోసా' ఇవ్వాలి

జూలూరుపాడు: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతు భరోసా పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేస్తామని హామీ ఇచ్చిందని దీనిని అమలు చేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంగళవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూమి ఉన్న రైతులతోపాటు కౌలు రైతులకు రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఇవ్వాలన్నారు.

భూమిలేని పేదలకు, ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో ఏడాదికి ఇస్తామన్న రూ.12 వేలు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో భూక్యా చరణ్‌నాయక్, శివనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి..



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు

పాల్వంచ: రోడ్డు భద్రత చర్యలు పాటించాలని జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ వెంకటరమణ, మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ దారా మనోహర్ అన్నారు. రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్‌లో భాగంగా మంగళవారం స్థానిక కేఎల్‌ఆర్ ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరి అని అన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు భద్రత ప్రమాణాలను వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్, శ్యాం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తమన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాదా బైనామాకు మోక్షం కలిగేనా?

- దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- మండలంలో మొత్తం దరఖాస్తులు 1,440
- గత ప్రభుత్వ హయాంలో 8,300



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రసాద్ (ఫైల్)

పాల్వంచరూరల్: సాదాబైనామా పైన రైతులు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. నెలరోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు పరిష్కారం జరగడం లేదని ఆవేదన చెందుతున్నారు. సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసుకున్న భూములకు పట్టాలిచ్చేందుకు గత ప్రభుత్వం రైతుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానించింది. దీంతో మండలంలో 8,300 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. అప్పటి ధరణి పోర్టల్‌లో సాదాబైనామాల సమస్యకు పరిష్కారం లేకపోవడంతో ఐదేళ్లుగా రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పలువురు రైతుల భూముల సర్వే నంబర్లు, పేర్లు, విస్తర్ణం తప్పుగా నమోదయ్యాయి. వాటి సవరణకు తహసీల్దార్ చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదు. తాము అధికారంలోకి వస్తే ధరణిని తొలిగించి, భూభారతి చట్టాన్ని తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్లుగా భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. నూతన చట్టంలో సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసుకున్న భూములకు పట్టాలు జారీ చేసే అవకాశం కల్పించింది. అయితే నిబంధనల ప్రకారం 2014కు ముందు కొనుగోలు చేసి ఉండాలి. రెండు నెలల క్రితం రెవెన్యూ గ్రామసభల్లో మండలంలోని రైతులు సాదాబైనామాల కోసం 1,257 మంది దరఖాస్తు చేసుకుని పరిష్కారం కోసం నిరీక్షిస్తున్నారు.

అవగాహన లేక...

గతంలో రైతులు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపై అవగాహన లేని సమయంలో తెల్లకాగితలపై (సాదాబైనామా) ఒప్పందాలు చేసుకుని భూమిని స్వాధీనం చేసుకునేవారు. అంగీకారం (మోకా)పై భూమిని స్వాధీనం చేసుకున్నప్పటికీ రెవెన్యూ రికార్డులలో భూ హక్కులు లేకపోవడంతో ప్రభుత్వం అందించే రైతు భరోసా, బీమా, పీఎం కిసాన్, రుణమాఫీ వంటి పథకాలను రైతులు పొందలేకపోతున్నారు.


నమ్మకంతో దరఖాస్తు చేసిన...



నాకు ఆరు ఎకరాల భూమికి మీసేవ పహణీ ఉంది. పాసుపుస్తకం లేదు. గత ప్రభుత్వ హయాంలో సాదాబైనామా కోసం దరఖాస్తు చేసుకున్నా పాసుపుస్తకం రాలేదు. ఈ ప్రభుత్వ అయినా సాదాబైనామాకు మోక్షం కల్పిస్తుందనే నమ్మకంతో దరఖాస్తు చేసుకున్నా.

– సాము వీరారెడ్డి, రైతు, రెడ్డిగూడెం


త్వరగా పరిష్కారం చూపాలి..



భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ గ్రామ సభల్లో రైతులు చేసుకున్న సాదాబైనామా దరఖాస్తులను అధికారులు త్వరితగతిన పరిష్కరించారు. రైతులకు పాసుపుస్తకాలు అందజేయాలి. ఎన్నికలు ముందు చెప్పినట్టుగా ఇప్పుడు జరగడం లేదు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఎదవల్లి కృష్ణ, రైతు, పుల్లాయిగూడెం

అనుమతులు రాగానే పరిష్కరిస్తాం..



భూ భారతి చట్టం ద్వారా గ్రామసభల్లో స్వీకరించిన సాదాబైనామా దరఖాస్తుల సమస్యలను ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పరిష్కరిస్తాం. 817, 999, 444, 727, 126, 63 సర్వే నంబర్ ప్రభుత్వ భూములకు సంబంధించివి. వీటికి దరఖాస్తు చేసుకుంటే పరిష్కారం ఉండదు.

– దారా ప్రసాద్, తహసీల్దార్, పాల్వంచ